క్లుప్తంగా

నేడు విశ్వయోగి మహారాజ్ జన్మదినోత్సవం

కనిగిరిరూరల్: విశ్వయోగి మహారాజ్ 28వ జన్మదినోత్సవ వేడుకలు గురువారం స్థానిక శివ నగర్ కాలనీలోని సద్గురు దత్తపీఠంలో రమేష్ గురుయోగి మహారాజ్ సన్నిధిలో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి విశిష్ట పూజలు జరుగుతాయని, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రేపు మండల సమావేశం

సీఎస్‌పురం(పామూరు): మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని కోరారు.

పొన్నలూరు: మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 4న శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుజాత బుధవారం ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొనాలని, మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

నాణ్యమైన బేళ్లకే అధిక ధర



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

కొండపి: నాణ్యమైన బేళ్లకే అధిక ధర లభిస్తుందని కొండపి వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ అన్నారు. వేలం సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన వేలంలో జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాలకు చెందిన రైతులు 620 బేళ్లను వేలానికి తీసుకురాగా అందులో 535 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసి వివిధ కారణాలతో 85 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.240, సరాసరి రూ.260.05గా నమోదైంది. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర రూ. 265.95గా నమోదైంది. వేలం కేంద్రానికి పొందూరు క్లస్టర్ గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 378 బేళ్లను తీసుకురాగా వాటిలో 329 కొనుగోలు చేసి 49 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.240, సరాసరి రూ.265.95గా నమోదైంది. వేలంలో 14 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న 12 చూర బేళ్లు పట్టివేత



స్వాధీనం చేసుకున్న పొగాకు చూర బేళ్లు

టంగుటూరు: అక్రమంగా తరలిస్తున్న 12 చూర బేళ్లను పొగాకు బోర్డు విజిలెన్స్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకొని టంగుటూరు వేలం కేంద్రానికి తరలించారు. పొగాకు బోర్డు విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల మేరకు..టోల్ ప్లాజా సమీపంలో విధులు నిర్వహిస్తుండగా మినీ ఆటోలో పొగాకు బేళ్లు గమనించి తనిఖీ చేయగా అక్రమ పొగాకు చూర బేళ్లని గుర్తించి స్థానిక వేలం కేంద్రానికి తరలించారు. బేళ్లకు రూ.32 వేల జరిమానా విధించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు హేమంత్‌కుమార్, నవీన్ పాల్గొన్నారు.

13 పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా ప్రతిపాదనలు

సింగరాయకొండ: కూటమి ప్రభుత్వ ఆదేశాలతో మండలంలో 13 పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా జిల్లా విద్యాశాఖాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఎంఈఓ-1 కత్తి శ్రీనివాసరావు తెలిపారు. పాతసింగరాయకొండ పంచాయతీలోని మల్లికార్జుననగర్, బాలిరెడ్డినగర్, హెచ్‌పీ ప్రాథమిక పాఠశాలలు, కానంపూడి ప్రాథమికోన్నత పాఠశాల, సింగరాయకొండ పంచాయతీలోని బాలయోగినగర్, శ్రీరాంనగర్, వెస్ట్ ప్రాథమిక పాఠశాలలు, సోమరాజుపల్లి ప్రాథమిక పాఠశాల, టీపీనగర్ ప్రాథమిక పాఠశాల, పాకల పంచాయతీలోని పల్లెపాలెం, క్రాంతినగర్, పోతయ్యగారిపట్టపుపాలెం ప్రాథమిక పాఠశాలలు, ఊళ్లపాలెం పంచాయతీ దేవలం పల్లెపాలెం ప్రాథమిక పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా ప్రతిపాదనలు పంపినట్లు ఎంఈఓ వివరించారు.

అద్దాల్లాంటి రోడ్లా.. అవెక్కడ..?

- రోడ్లను అద్దాల్లా మారుస్తామంటూ కూటమి నేతల గొప్పలు
- అధ్వానంగా ఉన్న రోడ్ల వైపు కన్నెత్తి చూడని నేతలు
- కలికవాయ-నందనవనం రోడ్డుపై ప్రయాణం సాహసమే
- ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లతో ధ్వంసమైన రోడ్లు
- గుంతలమయంగా జరుగుమల్లి-కామేపల్లి ఆర్‌అండ్‌బీ రహదారి



అధ్వానంగా ఉన్న కలికవాయ- నందనవనం రోడ్డు

జరుగుమల్లి(సింగరాయకొండ): కూటమి నేతల మాటలకు చేతలకు పొంతన ఉండటం లేదు. సంక్రాంతి నాటికి రోడ్లన్నింటినీ అద్దాల్లా మారుస్తామంటూ ఆర్భాటపు ప్రకటనలు చేశారు. కానీ సంక్రాంతి దాటి రెండు నెలలు దాటినా ఇప్పటికీ ఆ రోడ్ల వైపు కన్నెత్తి చూసే వారే కరువయ్యారు. దీంతో అధ్వానంగా ఉన్న రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లకు కనీస మరమ్మతులు చేయకపోవడంతో ఆ రోడ్లలో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

నరకప్రాయంగా నందనవనం రహదారి..

మండలంలో కలికవాయ-నందనవనం రహదారిని గత టీడీపీ ప్రభుత్వంలో 2019లో నిర్మించారు. ఈ రోడ్డును నిర్మించిన రెండు రోజులకే రోడ్డు మార్జిన్లలో తారు లేచిపోయి గుంతలు ఏర్పడగా వాటికి అతుకులు వేశారు. ఇంత అధ్వాన్నంగా వేసిన ఈ రోడ్డుకు 5 సంవత్సరాల పాటు నిర్వహణ బాధ్యత సదరు కాంట్రాక్టర్‌దే. కానీ పంచాయతీ రాజ్ అధికారుల నిర్లక్ష్యంతో కాంట్రాక్టరు సదరు రోడ్డుకు మరమ్మతులు చేయకపోవటంతో రోడ్డు గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ఆ రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

ఇసుక ట్రాక్టర్లు, ట్రిప్పర్లతో రోడ్లు ధ్వంసం

ఈ రోడ్డు నుంచి ప్రతిరోజు సుమారు వందకు పైగా ఇసుక ట్రాక్టర్లతో పాటు ట్రిప్పర్లు కూడా వెళుతుండటంతో రోడ్డుతో పాటు మార్జిన్లు కూడా పూర్తిగా ధ్వంసం అయ్యాయి. దీంతో మోటారుసైకిల్ పై 5 నిముషాల్లో వెళ్లాల్సిన ప్రయాణానికి సుమారు అర గంట పడుతుందని వాహనదారులు వాపోతున్నారు.



గుంతమయంగా ఉన్న జరుగుమల్లి-కామేపల్లి ఆర్‌అండ్‌బి రహదారి

గతుకులమయంగా ఆర్‌అండ్‌బీ రహదారి..

మండలంలోని జరుగుమల్లి- కామేపల్లి మధ్య రహదారి గుంతలమయంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈరోడ్డు లో గుంతలు ఏర్పడటంతో అప్పుడప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరగా రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని, ఇంకా నిధులు మంజూరు కాలేదని తెలియజేస్తున్నారు. ఈ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేసి రోడ్లు అద్దాల్లాగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎవ్వరూ పట్టించుకోవడం లేదు



మండలంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు తప్ప ఆచరణలో మాత్రం అమలు కావటం లేదు. దీంతో గతుకుల రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలకు నరకం కనిపిస్తోంది. రోడ్లకు వెంటనే నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలి.

-కనపర్తి శేషారెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు

ప్రకటనలు తప్పే ఆచరణ ఏది..?



కూటమి ప్రభుత్వంలో రోడ్లు అధ్వాన్నంగా ఉండటంతో ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తుంది. రోడ్లను అద్దాల్లా మారుస్తామని ప్రకటనలు తప్ప ఒక్క రోడ్డును కూడా బాగు చేసిన దాఖలాలు లేవు. రోడ్లకు మరమ్మతులు చేసి ప్రజల ఇబ్బందులు తీర్చాలి.

- తాటికొండ రామచంద్రరావు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ

భైరవకోనలో ఎస్పీ ప్రత్యేక పూజలు



భైరకోనలో అర్చకులతో ఆలయ విశిష్టతపై చర్చిస్తున్న ఎస్పీ దామోదర్

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోన క్షేత్రాన్ని బుధవారం సాయంత్రం ఎస్పీ ఏఆర్ దామోదర్ సందర్శించారు. అనంతరం త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యాంసుందర్‌రాజు ఆధ్వర్యంలో ఎస్పీకి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం జలపాతాన్ని సందర్శించిన ఎస్పీ క్షేత్ర ప్రాధాన్యత, ఆలయ విశేషాలపై అర్చకులు, సిబ్బందితో మాట్లాడారు. డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్, సీఐ భీమానాయక్‌లు, ఎస్‌బీ సీఐ రాఘవేంద్ర, సీఎస్‌పురం ఎస్సై ఆర్.సుమన్, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న గృహనిర్మాణశాఖ డీఈ శ్రీనివాస ప్రసాద్

సింగరాయకొండ: ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనపు నిధులు మంజూరు చేస్తుందని గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గృహనిర్మాణాలపై సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 675 గృహాలు అసంపూర్తిగా నిర్మించారని, వీటికి ఎస్సీ సబ్‌ప్లాన్ కింద ప్రభుత్వం లబ్ధిదారులు ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా ఆర్థికసాయం చేస్తుందన్నారు. ఈ నిధులతో నిర్మాణాలు పూర్తయ్యేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. గృహ నిర్మాణశాఖ డీఈ సత్యన్నారాయణ, ఎంపీడీఓ డి.జయమణి, గృహనిర్మాణశాఖ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆలయ మండల పూజ మహోత్సవం



విశిష్ట అలంకరణలో శ్రీలక్ష్మీ గణపతి ఆలయం (ఫైల్)

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అయ్యలూరివారిపల్లెలో నూతనంగా నిర్మించి, విగ్రహప్రతిష్ట గావించిన లక్ష్మీ గణపతి ఆలయ మండలపూజ మహోత్సవ ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక కమిటీ తెలిపింది. 4వ తేదీ శుక్రవారం సాయంత్రం గణపతిపూజ, పుణ్యాహవాచనం, వాస్తుహోమం, మంగళహారతి, 5వ తేదీ శనివారం కలశస్థాపన, గణపతి మూలమంత్ర విశేషహోమం, పంచామృతాభిషేకం, పూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 6వ తేదీ శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల శాంతి కల్యాణం, సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం, వసంతోత్సవం నిర్వహిస్తామని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి



ఎస్పీకి రు.3 లక్షల చెక్కు అందజేస్తున్న పాఠశాలలు, కళాశాలల సీఈలు



సిబ్బందికి హెల్మెట్లు అందజేస్తున్న ఎస్పీ

- ఎస్పీ దామోదర్

సీఎస్‌పురం(పామూరు): పెండింగ్ కేసులపై దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేసి తక్షణమే ఫిర్యాదుదారులకు పరిష్కారం అందించాలని ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి వాటి నిర్వహణపై పలు సూచనలు చేశారు. క్వార్టర్స్, స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై ఆరా తీసి సూచనలు చేశారు. మహిళల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, మహిళలు, పిల్లలపై జరిగే అకృత్యాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం చేయాలన్నారు. కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐ భీమానాయక్, ఎస్సై ఆర్.సుమన్ ఉన్నారు.



సీఎస్‌పురం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేస్తున్న ఎస్పీ దామోదర్

ప్రమాద రహిత ప్రయాణానికి హెల్మెట్ ధరించాలి

పామూరు: ప్రమాద రహిత ప్రయాణం కోసం మద్యం, డ్రగ్స్‌కు దూరంగా ఉండి హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలపై ప్రయాణించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను బుధవారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వాహన చోదకులు, ఆటోడ్రైవర్లతో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. డ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించాలని, అధికలోడ్ వద్దని, లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహన నడపవద్దన్నారు. నగల దుకాణం యజమానులు విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. బెట్టింగ్, సైబర్‌క్రైం, డగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి రికార్డుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బులియన్ మర్చంట్ వారు 25 సీసీకెమెరాలు ఎస్పీకి అందజేశారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల వారు సీసీ కెమెరాలకోసం రూ.3 లక్షల విరాళం, డాక్టర్ మల్లికార్జునరెడ్డి హాస్పిటల్ తరుపున డాక్టర్ మల్లికార్జునరెడ్డి రూ.2 లక్షల విరాళం సీసీ కెమెరాలకు అందజేశారు. సిబ్బందికి హెల్మెట్‌లను సీఎస్పీ, డీఎస్పీతో కలిసి పంపిణీచేశారు. మహిళాపోలీసులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా పలువురు ఎస్పీని సన్మానించారు. కార్యక్రమంలో కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్‌బి సీఐ రాఘవేంద్ర, పామూరు సీఐ భీమానాయక్, ఎస్సై టి.కిషోర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

7 నుంచి ఇంటర్మీడియెట్ తరగతులు ప్రారంభం



ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

కొండపి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 7 నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం తరగతులను ఒకటో తేదీ నుంచి ప్రారంభించామని, మొదటి సంవత్సరం తరగతులను ఏడో తేదీ నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. తమ కళాశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ల్యాబ్ రికార్డ్స్, స్టడీమెటీరియల్స్, బ్యాగులు అందజేస్తామని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్నం ఉచితంగా భోజనం అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీల ఏర్పాటు



పోలీస్‌స్టేషన్ సెంటర్లో కర్ర విరగటంతో రోడ్డు కు అడ్డంగా ఉన్న ఫ్లెక్సీ

సింగరాయకొండ:

మండల కేంద్రంలో ఇటీవల కాలంలో ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా, డివైడర్‌లపై ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటంతో ఒక్కోసారి యూ టర్నింగ్‌ల వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అంతేకాక ఫ్లెక్సీలు ఏర్పాటులో నిర్లక్ష్యం కారణంగా కర్రలు విరిగి వాహనదారులపై పడటంతో ప్రమాదాల పాలవుతున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కర్ర విరిగిపోవటంతో రోడ్డుకు అడ్డంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఫ్లెక్సీల ఏర్పాటులో పంచాయతీ వారు రుసుము ఏర్పాటు చేయాల్సి ఉండగా కూటమి ప్రభుత్వ నాయకుల ఆజ్ఞలతో ఒక్క పైసా కూడా వసూలు చేసే పరిస్థితి లేదు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

టంగుటూరు: ఆరోగ్యం బాగాలేక హాస్పిటల్లో చికిత్స పొందుతున్న రామకృష్ణ కుటుంబానికి యూత్ హెల్ప్ ఆర్గనైజేషన్ ఫండ్ నుంచి ఆర్థికసాయాన్ని బుధవారం అందించారు. స్థానిక అరుంధతీనగర్లో నివాసముంటున్న కొమ్ము రామకృష్ణ కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో రామకృష్ణ కుటుంబసభ్యులకు వైద్య ఖర్చుల నిమిత్తంరూ.5 వేలను అందజేశారు. ఆర్గనైజేషన్ సభ్యులు దేవరపల్లి చంద్రశేఖర్, కురుగుంట్ల ప్రవీణ్, చాట్రగడ్డ దినేష్, చాట్రగడ్డ అనిల్, పాదిలి శశికుమార్, వీరమల్లి అజయ్, ఇత్తడి వినయ్, గర్నెపూడి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం



పొగాకు బ్యారన్‌లో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పొన్నలూరు: మండలంలోని కోటపాడు గ్రామంలో కొచ్చెర్ల పెద కాశయ్య, అన్నెం చిన నాగయ్య, షేక్ మస్తాన్‌లకు చెందిన పొగాకు బ్యారన్ బుధవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బ్యారన్‌లో క్యూరింగ్ జరుగుతుండగా పొగాకు అల్లిక కర్రలు జారి మొద్దుగొట్టంపై పడటంతో ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో 1200 పొగాకు కర్రలు, బ్యారన్ లోపలి భాగాలు పూర్తిగా కాలిపోవడంతో దాదాపుగా రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోనికి తీసుకువచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపి: కొండపిలో మరమ్మతుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ హర్దీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కొండపి టౌన్, దాసిరెడ్డిపాలెం, ముక్కోడిపాలెం, పెద్దకల్లగుంట, జాళ్లపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అక్రమ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకోండి

- సబ్ కలెక్టర్‌ను వేడుకున్న దళిత, గిరిజనులు
- సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

కందుకూరు: దశాబ్దాలుగా సాగు చేకుంటున్న భూముల్లో కొందరు పెత్తందార్లు అక్రమంగా రాత్రికి రాత్రే రోడ్డు నిర్మాణం చేపట్టారంటూ గుడ్లూరు మండలం పెదలాటరఫి గ్రామానికి చెందిన దళితులు, గిరిజనులు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. తమ భూములను కాపాడాలంటూ సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2008లో ప్రభుత్వం పెదలాటరఫీ గ్రామ సర్వే నంబర్ 287లో 20 మంది ఎస్సీ, ఎస్టీలకు ఒక్కొక్కరికి 90 సెంట్లు చొప్పున భూమిని పంపిణీ చేశారు. అప్పటి నుంచి ఆ భూములను సాగు చేసుకుంటూ పంటలు పండించుకుంటూ జీవిస్తున్నారు. ప్రస్తుతం ఈ భూములపై కన్నేసిన గ్రామానికి చెందిన సోమినేని రవి, ముప్వా మల్లికార్జున, ముప్వా శోభన్‌బాబు, ఉప్పుటూరి నారాయణలు కలిసి అర్ధరాత్రి భూముల్లో రోడ్డు వేశారు. దీనిపై ప్రశ్నించినందుకు దౌర్జన్యం చేసి దిక్కున్న చోట చెప్పుకోండి..అంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు.

రెండు బైక్‌లు ఢీ

- వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన మాలకొండయ్య

పొన్నలూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో వ్యక్తి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని చెన్నిపాడు అడ్డరోడ్డు వద్ద బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..కందుకూరు ప్రాంతానికి చెందిన ఏ మాలకొండయ్య పని నిమిత్తం చెన్నిపాడు గ్రామానికి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో చెన్నిపాడు అడ్డ రోడ్డు వద్దకు రాగానే కె.అగ్రహారం నుంచి కందుకూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో మాలకొండయ్య కాలుకి తీవ్ర గాయమైంది. దీంతో 108కు సమాచారం ఇవ్వడంతో చికిత్స కోసం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.